సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 5 । జూన్ । 2024



గెలుపొందిన అనంతరం నగేశ్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి రాజర్షి షా

గరిష్టం/కనిష్టం 38.0/28.0

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆదిలాబాద్ పార్లమెంట్ విజేత
గొడం నగేశ్ (బీజేపీ)
వచ్చిన ఓట్లు : 5,68,168
మెజార్టీ : 90,652

రెండో స్థానం: ఆత్రం సుగుణ (కాంగ్రెస్)
వచ్చిన ఓట్లు : 4,77,516

మూడో స్థానం : ఆత్రం సక్కు (బీఆర్ఎస్)
వచ్చిన ఓట్లు: 1,37,300

- ఎంపీగా గెలిచిన గొడం నగేశ్
- నిర్మల్, ముథోల్‌లో బీజేపీకి భారీ మెజార్టీ
- ఖానాపూర్, సిర్పూర్, ఆదిలాబాద్, బోథ్‌లో స్వల్పమే..
- 'అసెంబ్లీ'తో పోల్చితే అధిక ఓట్లు సాధించిన కాంగ్రెస్
- ఒక్క ఆసిఫాబాద్‌లోనే సుగుణకు లీడ్
- చీలిన బీఆర్ఎస్ ఓటు.. బీజేపీ, కాంగ్రెస్‌కు టర్న్



విజయోత్సవ సంబురం..: ఎంపీగా గెలుపొందిన తర్వాత విక్టరీ సింబల్ చూపుతున్న గొడం నగేశ్, ఎమ్మెల్యే శంకర్

మళ్లీ కమలమే..





కౌంటింగ్ కేంద్రంలో ఓట్లను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కమలం పార్టీ మళ్లీ వికసించింది. ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్ భారీ మెజార్టీతో గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ పోటీనిచ్చినప్పటికీ భారీ ఓట్ల వెనుకంజలో నిలిచారు. అయితే అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఆ పార్టీకి వచ్చిన ఓట్లతో పోల్చుకుంటే సుగుణకు భారీగా ఓట్లు లభించాయి. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు డిపాజిట్ మాత్రమే దక్కింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో అత్యధిక ఓట్లు సాధించిన కారు పార్టీని ఈ ఎన్నికల్లో మాత్రం ఓటర్లు ఆదరించలేదు. ఆ పార్టీ ఓట్లు బీజేపీ, కాంగ్రెస్ వైపు మళ్లాయి.

మొదటి రౌండ్ నుంచే ఆధిక్యం..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటలకు ఎన్నికల ఓట్ల కౌంటింగ్ మొదలైంది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించి టీటీడీసీలో, నిర్మల్, ఖానాపూర్, ముథోల్‌కు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, ఆసిఫాబాద్, సిర్పూర్‌లకు సంబంధించి సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించారు. ఆదిలాబాద్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషా ఆధ్వర్యంలో సాగగా, మిగతా కేంద్రాల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో కొనసాగింది. ఈవీఎంల మొదటి రౌండ్ ఫలితం ఉదయం 9గంటల సమయంలో వెలువడింది. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి సాయంత్రం 4 గంటలైంది. కాగా బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్ మొదటి రౌండ్ నుంచే భారీ ఆధిక్యం సాధిస్తూ వచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ 11, 14, 16, 17 రౌండ్‌లలో స్వల్ప ఆధిక్యత సాధించారు. అయితే బీజేపీ విజయాన్ని అడ్డుకోలేకపోయారు. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ ఎంపీగా గొడం నగేశ్ ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషా ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సాయంత్రం ఆదిలాబాద్‌లో బీజేపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించింది.

ఆ రెండింటితోనే భారీ మెజార్టీ..

బీజేపీకి సిర్పూర్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో మెజార్టీ లభించింది. అయితే మొత్తం మెజార్టీలో నిర్మల్, ముథోల్‌లోనే భారీ ఆధిక్యం లభించింది. ఈ రెండు నియోజకవర్గాల్లో మొదటి రౌండ్ నుంచి కమలం పార్టీకి లభించిన ఓట్లతో మిగతా నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఆధిక్యం వచ్చినా కనబర్చలేకపోయింది. మొత్తంగా ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్‌లలో బీజేపీ ప్రాబల్యం చూపింది. అంతేకాకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న ఖానాపూర్‌లోనూ బీజేపీకే లీడ్ దక్కింది. ఒక్క ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మాత్రమే ఆత్రం సుగుణకు అత్యధిక ఓట్లు లభించాయి.

నియోజకవర్గాల వారీగా మెజార్టీ వివరాలు

నియోజకవర్గం	మెజార్టీ(పార్టీ)
సిర్పూర్	8,369 (బీజేపీ)
ఆసిఫాబాద్	26,940 (కాంగ్రెస్)
ఖానాపూర్	13,519 (బీజేపీ)
ఆదిలాబాద్	5,338 (బీజేపీ)
బోథ్	4,914 (బీజేపీ)
నిర్మల్	43,850 (బీజేపీ)
ముథోల్	37,833 (బీజేపీ)

రౌండ్‌ల వారీగా ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లు, మెజార్టీ వివరాలు..

రౌండ్ నంబర్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	మెజార్టీ (పార్టీ)
1	28,429	19,623	5,660	8,806 (బీజేపీ)
2	29,702	18,182	5,979	11,520 (బీజేపీ)
3	27,659	20,328	6,532	7,331 (బీజేపీ)
4	23,976	19,668	7,027	4,308 (బీజేపీ)
5	23,967	23,138	7,439	829 (బీజేపీ)
6	24,194	22,142	5,804	2,052 (బీజేపీ)
7	23,998	21,195	6,605	2,803 (బీజేపీ)
8	26,756	18,287	5,813	8,469 (బీజేపీ)
9	22,098	19,831	6,707	2,267 (బీజేపీ)
10	24,095	21,497	5,266	2,598 (బీజేపీ)
11	26,130	26,200	5,589	70 (కాంగ్రెస్)
12	23,512	20,882	6,942	3,378 (బీజేపీ)
13	23,881	20,134	5,815	3,747 (బీజేపీ)
14	26,918	27,179	5,752	261 (కాంగ్రెస్)
15	27,486	22,042	5,036	5,444 (బీజేపీ)
16	21,441	21,446	5,914	05 (కాంగ్రెస్)
17	23,812	23,911	5,032	99 (కాంగ్రెస్)
18	28,253	22,445	5,700	5,768 (బీజేపీ)
19	28,961	22,305	6,441	6,656 (బీజేపీ)
20	24,769	21,241	6,824	3,528 (బీజేపీ)
21	23,756	20,080	6,379	3,676 (బీజేపీ)
22	18,521	15,068	6,379	3,453 (బీజేపీ)
23	5,789	4,353	1,736	1,436 (బీజేపీ)

బీజేపీ గెలుపు సంబరాలు

ఆదిలాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీగా పార్టీ అభ్యర్థి గొడం నగేశ్ గెలుపొందడంతో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఇతర నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని నగేశ్ నివాసం వరకు విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. డీజే చప్పుళ్లు, కార్యకర్తల నృత్యాల నడుమ జోరుగా సాగింది.

భారీ బందోబస్తు



బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీసీ, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలల్లో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐలవ్‌యూ ఆదిలాబాద్ సెల్ఫీ పాయింట్ నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆ ప్రాంతంలో ఎవరినీ అనుమతించలేదు. కౌంటింగ్ ఏజెంట్లను, పాస్‌లు ఉన్నవారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిఘా పెట్టారు. 1,100 మంది పోలీసులతో గట్టి బందోబస్తు చేపట్టారు. ఎస్పీ గౌస్ ఆలం కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే పట్టణంలో మద్యం దుకాణాలను మూసి ఉంచేలా చర్యలు చేపట్టారు. లెక్కింపు ప్రక్రియ ముగిసేంత వరకు అప్రమత్తంగా వ్యవహరించారు. ఎస్పీతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పర్యవేక్షించారు.

ఆదిలాబాద్ ఎంపీ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2019, 2024లలో పార్టీల వారీగా పోలైన ఓట్ల వివరాలు..

నియోజకవర్గం	బీజేపీ		బీఆర్ఎస్		కాంగ్రెస్	
	2019	2024	2019	2024	2019	2024
సిర్పూర్	24,047	71,325	60,740	19,840	47,355	62,956
ఆసిఫాబాద్	44,874	47,056	47,401	38,597	43,793	73,996
ఖానాపూర్	47,320	75,106	30,481	18,520	60,748	61,587
ఆదిలాబాద్	63,169	82,394	47,594	16,265	37,803	77,056
బోథ్	61,094	70,118	42,850	22,472	36,392	65,204
నిర్మల్	61,172	1,06,770	45,387	8,181	46,617	62,920
ముథోల్	75,216	1,05,334	44,212	12,505	41,349	67,501
మొత్తం	3,76,892	5,58,103	3,18,665	1,36,380	3,14,057	4,71,220

మొన్నటి అసెంబ్లీ.. గత, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ వివరాలు..

ఎన్నికలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
అసెంబ్లీ- 2023	16,25,101	13,07,563	80.46
పార్లమెంట్- 2019	14,88,353	10,62,895	71.41
పార్లమెంట్- 2024	16,50,175	12,21,563	74.03

2023 అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు..





ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న సిబ్బంది



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు తీరును పరిశీలిస్తున్న కలెక్టర్



సీసీ నిఘాను ల్యాప్‌టాప్ ద్వారా పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

ఆలయంలో 'గొడం' పూజలు



పూజలు నిర్వహిస్తున్న నగేశ్, ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఈ మేరకు ఎంపీగా ఎన్నికైన గొడం నగేశ్ జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి హారాన్ని సమర్పించి, వేదపండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. ఎంపీగా విజయం సాధించిన నగేశ్‌కు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పాటిల్ అభినందనలు తెలిపారు.



నిరాశతో..

కౌంటింగ్ కేంద్రం నుంచి నిరాశతో వెనుదిరుగుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఆత్రం సక్కు, ఆత్రం సుగుణ



నేతల ఇలాఖాలో..

- బోథ్‌లో పట్టు నిలుపుకున్న పలువురు
- ఆదిలాబాద్‌లో సత్తా చాటిన ఎమ్మెల్యే పాయల్
- జోగు, కంది మాత్రం వెనుకబాటు

కైలాస్‌నగర్: ఈ ఎన్నికల్లో పలువురు నేతలు తమ ఇలాఖాలో సత్తా చాటగా.. మరికొందరు వెనుకబడ్డారు. బోథ్ నియోజకవర్గంలో చాలా మంది సక్సెస్ కాగా.. ఆదిలాబాద్‌లో మాత్రం భిన్నమైన పరిస్థితి కనిపించింది.

బోథ్ నియోజకవర్గంలో..

ఎంపీగా గెలుపొందిన గొడం నగేశ్ తన స్వగ్రామమైన బజార్‌హత్నూర్ మండలం జాతర్లలోని పోలింగ్ కేంద్రం నం.189లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ బీజేపీకి 597 ఓట్లు పోలవగా.. బీఆర్ఎస్‌కు 189, కాంగ్రెస్‌కు 72 ఓట్లు మాత్రమే వచ్చాయి.

- మాజీ ఎంపీ సోయం బాపూరావు తన స్వగ్రామమైన బోథ్ మండలం ఘన్‌పూర్‌లోని పోలింగ్ కేంద్రం నం. 219లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ బీజేపీకి 297 ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 95, కాంగ్రెస్‌కు 191 ఓట్లు పోలయ్యాయి.
- బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండ మండలంలోని తన స్వగ్రామమైన రాజురాలో గల పోలింగ్ కేంద్రం నం.301లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ బీఆర్ఎస్‌కు 367ఓట్లు రాగా, బీజేపీకి 203, కాంగ్రెస్‌కు కేవలం 37 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ నేరడిగొండ మండలంలోని తన స్వగ్రామమైన బొందిడిలో గల పోలింగ్ కేంద్రం 285లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ బీఆర్ఎస్‌కు 134, బీజేపీకి 122 ఓట్లు పోలవ్వగా, కాంగ్రెస్‌కు మాత్రం 320 ఓట్లు వచ్చాయి.

ఆదిలాబాద్‌లో..

ఆదిలాబాద్ నియోజకవర్గంలో భిన్న పరిస్థితి కనిపించింది. బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పట్టణంలోని పోలింగ్ కేంద్రం నం. 271లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో బీఆర్ఎస్‌కు కేవలం 8 ఓట్లు మాత్రమే పోలవ్వగా, కాంగ్రెస్‌కు 76 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 568 ఓట్లు సాధించి తన సత్తా చాటారు. ఇక బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న జైనథ్ మండలంలోని తన స్వగ్రామమైన దీపాయిగూడ పోలింగ్ కేంద్రం నం .27లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ బీఆర్ఎస్‌కు 165, కాంగ్రెస్‌కు 130 ఓట్లు రాగా అత్యధికంగా బీజేపీకి 280 ఓట్లు పోలవడం గమనార్హం. ఇక కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల పోలింగ్ కేంద్రం నం.177లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్‌కు 234 ఓట్లు, బీఆర్ఎస్‌కు 19 ఓట్లు రాగా, బీజేపీకి 428 ఓట్లు పోలవడం గమనార్హం.

వికసించిన 'కమలం'.. పుంజుకున్న 'హస్తం'

- చతికిలపడ్డ బీఆర్ఎస్
- ఐదు నెలల వ్యవధిలోనే మారిన పరిస్థితి

2023 అసెంబ్లీ, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లు, వ్యత్యాసం వివరాలు..

పార్టీ	అసెంబ్లీ	పార్లమెంట్	వ్యత్యాసం
ఆదిలాబాద్ నియోజకవర్గంలో..			
కాంగ్రెస్	46,763	77,056	30,293
బీజేపీ	66,468	82,394	15,926
బీఆర్ఎస్	60,321	16,265	44,056
బోథ్			
కాంగ్రెస్	32,797	65,204	32,407
బీజేపీ	53,992	70,118	16,126
బీఆర్ఎస్	76,792	22,472	54,320



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడయ్యాయి. ఎంపీగా బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్ ఘన విజయం సాధించారు. ఈ ఫలితాలను పరిశీలిస్తే అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన పార్టీల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కమలం పార్టీ తన జోరును మరోసారి కొనసాగించింది. పల్లె నుంచి పట్టణం దాకా ప్రజల్లో పట్టు నిలుపుకుంది. ఓటు బ్యాంకు గణనీయంగా పెంచుకొని విజయఢంకా మోగించింది. కాంగ్రెస్ సైతం అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే భారీగానే ఓట్లను పెంచుకోగలిగింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ జిల్లాలోనూ పాగా వేసేందుకు తీవ్రంగా శ్రమించింది. ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నించింది. ఓటు బ్యాంకును పెంచుకోగలిగిందే తప్ప విజయం సాధించలేకపోయింది. ఇక మొన్నటి దాకా గల్లీ నుంచి ఢిల్లీ దాకా సత్తా చాటిన బీఆర్ఎస్ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. దెబ్బమీద దెబ్బ అన్నట్లుగా ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లోనూ దారుణ పరాభవం ఎదురైంది. ఈ ఎన్నికల్లో ఓటర్లు కారు గుర్తు వైపు చూసిన దాఖలాలు కనిపించలేదు. అందుకు ఆ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కుకు వచ్చిన ఓట్లే నిదర్శనం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోలిస్తే సగం కూడా ఓట్లు దక్కకపోడం క్షేత్రస్థాయిలో ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతోంది.

తపాలా శాఖలో గ్రేడ్-1 పోస్టుమాస్టర్ల బదిలీలు

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్రంలోని ఐదు హెడ్ పోస్టాఫీసుల్లో పనిచేసే హయ్యర్ సెలక్షన్ గ్రేడ్-1(హెచ్‌ఎస్‌జీ-1) పోస్టుమాస్టర్లను బదిలీ చేస్తూ హైదరాబాద్ ప్రాంతీయ పోస్టుమాస్టర్ జనరల్ సుమిత అయోధ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఇద్దరు పోస్టుమాస్టర్లకు హయ్యర్ సెలక్షన్ గ్రేడ్-1 పోస్టుమాస్టర్లుగా(హెచ్‌ఎస్‌జీ-1) పదోన్నతి కల్పించడమే కాక బదిలీ చేశారు. నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్లు(హెచ్‌ఎస్‌జీ-2)గా పనిచేస్తున్న జి.గంగాధర్‌కు హెచ్‌ఎస్‌జీ-1గా ఉద్యోగోన్నతి కల్పించి ఆదిలా బాద్ హెడ్ పోస్టాఫీస్‌కు, కె.అజయ్‌కుమార్‌ను నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లోనే హెచ్‌ఎస్‌జీ-1గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



ఆటోతో సహా పట్టుకున్న కలప దుంగలు

నేరడిగొండ: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న కలప దుంగలను ముందస్తు సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం ఉదయం తర్నం నుంచి కుమారి గ్రామానికి ఆటోలో 13 టేకు దుంగలు తరలిస్తుండగా పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని నేరడిగొండ ఎఫ్ఆర్ వో గణేశ్ తెలిపారు. ముల్తానీలైన అబ్రార్, ఇంతియాజ్‌ల వద్ద నుంచి కుమారి గ్రామానికి చెందిన పురుషోత్తం అనే వడ్రంగి తర్నం గ్రామానికి చెందిన ఎ.ఫణిందర్ అనే వ్యక్తి ఆటోలో తరలిస్తుండగా పట్టుకొని కలపను స్వాధీనం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పిడుగుపాటుకు ఆలయ గోపురం ధ్వంసం



ధ్వంసమైన ఆలయ గోపురం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చిచ్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని సేవాదాస్‌నగర్‌లో గల హనుమాన్ ఆలయ గోపురంపై పిడుగు పడింది. దీంతో గోపురం కొంత మేర ధ్వంసమైంది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

పిడుగుపాటుకు పశుగ్రాసం దగ్ధం



దగ్ధమవుతున్న పశుగ్రాసం

సారంగపూర్: మండలంలోని యాకర్‌పెల్లిలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడి పశుగ్రాసం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పడిగెల కేదారినాథ్, పడిగెల సత్యనారాయణకు చెందిన దాదాపు 600ల గడ్డికట్టలను గ్రామ సమీపంలో గల పంటచేనులో కుప్పగా ఉంచారు. వాటిపై పిడుగు పడడంతో గడ్డికి నిప్పంటుకుని కాలిపోయింది. పశుగ్రాసం విలువ దాదాపు రూ.8వేల వరకు ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు సీఐ సతీష్ తెలిపారు. సాలెగూడ వద్ద ఇసుకతో వస్తున్న ట్రాక్టర్లను ఆపి అనుమతి పత్రాలు అడిగితే లేవని చెప్పడంతో డ్రైవర్ కం ఓనర్‌పై మైన్స్ మినరల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అడవుల సంరక్షణతోనే మనుగడ

- అంతరిస్తే వాతావరణంలో పెనుమార్పులు
- వర్షాలు పోయి కరువు సంభవించే ప్రమాదం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



ఇటీవల నరికివేతకు గురైన టేకు చెట్టు



కవ్వాల్ అభయారణ్యం

జన్నారం: అడవులు అంతరిస్తే ఆమ్లవర్షాలు కురిసి అనర్థాలకు దారితీస్తుంది. చెట్లను పెంచితేనే మానవాళికి మనుగడ. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటుకోవాల్సిన అవసరం ఉంది. భూమిపై పెరుగుతున్న కాలుష్యంతో ఓజోన్ పొర దెబ్బతిని మనిషి మనుగడకు కష్టంగా మారే ప్రమాదం ఉంది. తాను కూర్చున్న చెట్టు కొమ్మను తాను నరుక్కునే మూర్ఖుడిలా పర్యావరణాన్ని కాపాడే అడవులను కొందరు నరికివేస్తూ స్వార్థానికి వాడుకుంటున్నారు. పర్యావరణంపై అవగాహన పెంచడానికి 1972 జూన్ 5న ఐక్యరాజ్య సమితి సమావేశం ఏర్పాటు చేసి యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా ప్రకటించింది. 1973 జూన్ 5న మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

అంతరిస్తున్న అడవులు

ఆదిలాబాద్ జిల్లా అంటే అడవుల జిల్లా అని, పచ్చదనానికి చిరునామాగా పేరు గాంచింది. కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశం. 893 చదరపు కిలోమీటర్ల కోర్ ఏరియాగా 1123.25 చదరపు కిలోమీటర్ల బఫర్ ఏరియాలో వ్యాపించి ఉంది. ఇక్కడ విలువైన టేకు కలప ఉంది. పలు రకాల చెట్లకు, వివిధ రకాల వన్యప్రాణులకు చిరునామాగా నిలుస్తోంది. కానీ కొన్నేళ్లుగా పచ్చని అడవిపై గొడ్డలి వేటు పడుతోంది. దట్టమైన అడవులను పచ్చిక బయల్లుగా మార్చే కుట్ర జరుగుతోంది. కొందరు స్మగ్లర్లు తమ స్వలాభం కోసం పచ్చని అడవులపై గొడ్డలి వేటు వేస్తున్నారు. ఇలాగే కొనసాగితే మన దేశంలో వన సంపద ఉండేది..అడవులు ఉండేవి.. అని చెప్పుకునే రోజులు వచ్చే ప్రమాదం ఉంది.

పర్యావరణ రక్షణ ఎవరి బాధ్యత?

రోజురోజుకూ భూమిపై కాలుష్యం పెరిగితే మానవుని మనుగడకు ముప్పు వాటిల్లుతుంది. సూర్యుని నుండి వెలువడే అతి ప్రమాదకరమైన అతినీల లోహిత కిరణాల బారినుంచి కాపాడే ఓజోన్ పొర కాలుష్య కోరల వల్ల దెబ్బతినే అవకాశం ఉంది. ఒకవేళ ఓజోన్ పొర దెబ్బతింటే నేరుగా అతినీల లోహిత కిరణాలు భూమిపై పడితే వేడికి మనుషులు, పక్షులు, జంతువులు మాడిపోయే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదకరమైన సంఘటన జరుగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. భూమిపై పెరుగుతున్న నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యాన్ని తగ్గించి, విరివిగా మొక్కలు నాటాలి.. అడవులను రక్షించుకోవాలి.

బాధ్యతగా తీసుకోవాలి



పర్యావరణాన్ని కాలుష్యం చేయకుండా ఉండాలంటే జీవ, నిర్జీవ వస్తువులలో సమతుల్యత ఉండాలి. అంటే మనుషులు, జంతువులు, చెట్లు, నీరు, భూమి, గాలి లాంటి వాటిని కాలుష్యం చేయవద్దు. ప్రతి ఒక్కరూ అడవులను రక్షించడానికి, మొక్కలు పెంచడానికి కృషి చేయాలి. వాతవరణాన్ని కాలుష్యం చేయకుండా ఉండటానికి విరివిగా మొక్కలు నాటాలి. అడవులను కాపాడుకోవాలి.

– హఫీజొద్దీన్, ఫారెస్ట్ రేంజ్ అధికారి

పచ్చదనం పెంపునకు నడుం బిగించాలి

తరుగుతున్న అడవులను తిరిగి పెంచేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏటా హరితహారం పథకం కింద కోట్లాది మొక్కల పెంపకం చేపట్టింది. గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు విరివిగా మొక్కలు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పర్యావరణం దెబ్బతింటే భూమిపై నివసించే మనుషులు, జంతువులు, పక్షులు, అన్ని జీవరాశులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పెరుగుతున్న కాలుష్యం ఒకవైపు, పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం మరోవైపు పర్యావరణ కాలుష్యానికి దోహదం చేస్తున్నాయి. కాలుష్యాన్ని తగ్గించాలంటే పచ్చదనం పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

‘దేశంలో మహిళలకు రక్షణ కరువు’



జెండా ఆవిష్కరిస్తున్న నళినీరెడ్డి

ఎదులాపురం: దేశంలో మహిళలకు రక్షణ కరువైందని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముడుపు నళినీరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ 70వ ఆవిర్భావ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సమాఖ్య జెండాను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. మహిళా చట్టాలు ఉన్నప్పటికీ వాటిని కఠినంగా అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. వెరసి దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇందుకు నిత్యం దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలే ప్రత్యేక నిదర్శనమన్నారు. చట్టాలు అమలు పర్చడం, హక్కులను కాపాడుకోవడం కోసం మహిళలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం బీజేపీ మతం పేరుతో, దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తోందని ఎద్దేవా చేశారు. స్త్రీలను దేవతగా కొలిచే భారతావనిలో స్త్రీలకే రక్షణ లేకుండా పోయిందని, ఇప్పటికైనా ప్రభుత్వాలు మహిళా చట్టాలను పటిష్టంగా అమలు పర్చాలని, చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనాఖాన్, కృష్ణవేణి, షబానా, పుష్ప, అరుణరాణి, తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల కంటే నోటాకే అధికం

- పార్లమెంట్ పరిధిలో నోటాకు నాలుగో స్థానం
- మొత్తంగా 11,762 ఓట్లు నమోదు

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నోటాకు పోలైన ఓట్లు

సిర్పూర్	2,017
ఆసిఫాబాద్	2,717
ఖానాపూర్	1,653
ఆదిలాబాద్	1165
బోథ్	1,557
నిర్మల్	1,156
ముథోల్	1,385



కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రధాన పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే ఇతర పార్టీలు, స్వతంత్రులుగా పోటీ చేసిన అభ్యర్థులు కనీస పోటీ ఇవ్వలేకపోయారు. ప్రజల మద్దతును పొందడంలో విఫలమైన ఆ తొమ్మిది మంది డిపాజిట్లు కూడా కోల్పోయారు. వారికి పోలైన ఓట్ల కంటే నోటాకు వచ్చిన ఓట్లే అధికంగా ఉండడం విశేషం. బీఎస్పీ అభ్యర్థి మేస్రం జంగుబాపుకు 6,744 ఓట్లు, గొండ్వాన దండకారణ్య పార్టీ అభ్యర్థి కొడప వామన్‌రావుకు 1,685, డీఎస్పీ అభ్యర్థి మేస్రం గంగాదేవికి 3,468, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థి గేడం సాగర్‌కు 1,545, అన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్‌కు 4,644, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి ఎస్.తిరుపతికి 2,292, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫాంస్ అభ్యర్థి మాలోత్ శ్యాంలాల్ నాయక్‌కు 7,499, ఇండిపెండెంట్ అభ్యర్థులైన బుక్యా జైవంత్ రావు 6,446, రాథోడ్ సుభాష్‌కు 6,521 ఓట్లు పోలయ్యాయి. వీరి కంటే అత్యధికంగా నోటాకు 11,762 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతరులకు సైతం దాఖలు కావడం గమనార్హం. ఇందులో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 112 మంది ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఓటు వేయడం గమనార్హం. ఇదిలా ఉంటే 841 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. ఓటు వేయడంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల్లోని అవగాహన రాహిత్యానికి మరోసారి నిదర్శనంగా నిలిచింది. అత్యధికంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2,717 ఓట్లు నోటాకు రాగా, అత్యల్పంగా నిర్మల్ నియోజకవర్గంలో 1,156 ఓట్లు పోలవ్వడం విశేషం.

‘నీట్’లో విద్యార్థుల ప్రతిభ



శివరామకృష్ణ



సామ్య



దీక్షిత



చంద్రకిరణ్



దాసరి సహస్ర



పవన్ జ్యోత్

ఎదులాపురం: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జల్లెల భగవాండ్లు, అనూష దంపతుల కుమారుడు జె.శివరామకృష్ణ నీట్‌లో 541 మార్కులు సాధించి ప్రతిభను చాటాడు.

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన సంద కృష్ణవేణి-వేణుగోపాల్ దంపతుల కుమార్తె సామ్య 720 మార్కులకు గానూ 563 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చింది.

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగుల రవిగౌడ్-లత దంపతుల కుమార్తె దీక్షిత 720 మార్కులకు గానూ 677 మార్కులు సాధించింది. ఆల్ ఇండియాలో 9,975 ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 4,097వ ర్యాంకును సాధించింది.

సత్తా చాటిన ‘నవోదయ’ విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు నీట్ పరీక్షలో ప్రతిభ కనబర్చారని నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. కుమురం పవన్ జ్యోత్ 720 మార్కులకుగానూ 511 సాధించగా ఎస్టీ కేటగిరీలో 2,568, జాదవ్ సంజీవ్ 453 మార్కులు సాధించగా 5,228, చౌహాన్ 432 మార్కులు సాధించగా 6,690, తిలక్ 377 మార్కులు సాధించగా 11,657, సోయం 358 మార్కులు సాధించగా 13,776 ర్యాంకు, శ్రీనిత్య 328 మార్కులు సాధించగా 17,891 ర్యాంకు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మేడి చరణ్ దాస్, వసంత దంపతుల కుమారుడు మేడి చంద్రకిరణ్ 522 మార్కులు సాధించగా ఎస్సీ కేటగిరీలో 10,172 ర్యాంకు సాధించాడు. దాసరి లక్ష్మణ్-మమత దంపతుల కుమార్తె సిరిసహస్ర 720 మార్కులకుగానూ 560 సాధించగా బీసీ కేటగిరీలో 60,921 ర్యాంకు సాధించింది. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

‘నీట్’లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ



కట్ల సహజ



కట్ల సహాయ

ఖానాపూర్: దేశ వ్యాప్తంగా గత నెల 5న నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కట్ల శ్రీనివాస్ కూమార్తెలు కట్ల సహాయ 720 మార్కులకు గానూ 559, కట్ల సహజ 435 మార్కులు సాధించారు. ఎంబీబీఎస్‌లో ఇరువురు సీట్లు పొందే అవకాశం ఉండడంతో పలువురు అభినందిస్తున్నారు.

‘మిసెస్ వరల్డ్ పీస్’గా డాక్టర్ చంద్రిక



కిరీటం దక్కించుకున్న చంద్రిక

నిర్మల్: మిసెస్ వరల్డ్ పోటీల్లో శాంతికిరీటాన్ని గెలుచుకుని నిర్మల్ కీర్తికిరీటంలో కలికితురాయిగా నిలిచారు డాక్టర్ చంద్రిక. జిల్లా కేంద్రంలో గైనకాలజిస్టుగా సేవలందిస్తున్న ఆమె గురుగావ్‌లో నిర్వహించిన మిసెస్ వరల్డ్ ఫైనల్ పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. ఇటీవల ముగిసిన ఈ పోటీల్లో తన ప్రతిభను చాటి తృటిలో మిసెస్ వరల్డ్ కిరీటాన్ని కోల్పోయినా.. మరో ప్రతిష్టాత్మక మిసెస్ వరల్డ్ పీస్ కిరీటాన్ని దక్కించుకున్నారు. అలాగే మిసెస్ ఇంటలెక్చువల్ సబ్‌టైటిల్‌నూ కైవసం చేసుకోవడం విశేషం. ఫైనల్స్‌లో దేశవ్యాప్తంగా వచ్చిన 140 మందితో పోటీపడి వీటిని దక్కించుకోవడం సంతోషంగా ఉందని డాక్టర్ చంద్రిక పేర్కొన్నారు. వృత్తి బాధ్యతలను నిర్వర్తిస్తూ తాను ఈస్థాయి వరకు రావడానికి తన కుటుంబం సంపూర్ణంగా సహకరించిందన్నారు. యువతరం తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చన్నది నిరూపించడానికే తాను ఇలా పోటీపడినట్లు ఆమె పేర్కొన్నారు. డాక్టర్ చంద్రిక విజయంపై పలువురు వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రిమ్స్‌కు ‘పొల్యూషన్ కంట్రోల్ బోర్డు’ అవార్డు

ఆదిలాబాద్‌టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఉత్తమ కాలుష్య రహిత అవార్డుకు ఎంపిక చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఉత్తమ అవార్డు లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండు ప్రైవేటు, రెండు ప్రభుత్వ ఆస్పత్రులను ఎంపిక చేయగా ప్రభుత్వ విభాగంలో రిమ్స్ ఎంపికైంది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అధికారులు ఎస్టీపీ, సీఎఫ్‌వో, గుట్కా, పాన్ నిషేధం, పారిశుధ్య నిర్వహణ తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో రిమ్స్ ఆస్పత్రి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్యం చేపట్టడంతో పరిశుభ్రంగా కనబడుతోంది. ఇందుకుగానూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉత్తమ ఆస్పత్రిగా ఎంపికైంది. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ బుధవారం హైదరాబాద్‌లో అవార్డు అందుకోనున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



జల్కే ఆకాష్ మృతదేహం

బోథ్: మండలంలోని కోట కె గ్రామానికి చెందిన జల్కే ఆకాష్(20) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాము తెలిపారు. ఆకాష్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

- తప్పిన పెను ప్రమాదం



సంఘటన స్థలంలో కారు

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలోని సెంట్రల్ లైటింగ్ డివైడర్‌ను కారు ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కారు లోపల బెలూన్‌లు తెరుచుకోవడంతో అందులో ఉన్న వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. విద్యానగర్‌లోని రోడ్డు డివైడర్ ఢీకొని గతంలో పద్మావతినగర్‌కు చెందిన ఒకరు మృతి చెందారు. ఇదే ప్రాంతంలో గతంలోనూ పలు సందర్భాల్లో ప్రమాదాలు జరిగాయి. అయినప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు.

గుట్కా పట్టివేత



గుట్కా, నిందితుడితో పోలీసులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం గుట్కా విక్రయిస్తున్న అబ్రార్ అహ్మద్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. అతని వద్ద నుంచి రూ.2.80 లక్షల విలువైన గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

భైంసారూరల్: మండలంలోని సిద్ధూర్‌లో పంచశీల, సురేశ్ దంపతులకు చెందిన ఇల్లు మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. గ్రామానికి చెందిన పంచశీల సురేశ్ దంపతులు రేకులతో వేసిన షెడ్డులో నివసిస్తున్నారు. ఉదయం ఇంటికి తాళంవేసి కూలీ పనులకు వెళ్లారు. కొద్ది సేపటి తర్వాత ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. నిత్యావసర సరుకులు, బట్టలు కాలిబూడిదయ్యాయి.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

రెబ్బెన(ఆసిఫాబాద్): అత్యాచారం కేసులో పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6,500 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పునిచ్చారు. మండలంలోని రోళ్లపాడు గ్రామానికి చెందిన సుధాకర్ తాండూర్ మండలంలోని గోపాల్‌నగర్‌కు చెందిన ఒక మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆపై నిరాకరించటంతో 2020 మార్చి 5న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఐవోలు రమేశ్, అశోక్, సతీష్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు.

ఇంద్రాదేవికి విత్తన పూజలు



ఇంద్రాదేవికి విత్తనాల నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: ఖరీఫ్ సీజన్ సమీపించడంతో ఆదివాసీల ఆరాధ్య దైవమైన ఇంద్రాదేవి ఆలయంలో విత్తన పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ఉట్నూర్, నార్నూర్, గుడిహత్నూర్, జైనూర్ మండలాల నుంచి ఆదివాసీ రైతులు తరలివచ్చి అమ్మవారికి విత్తనాలతో కూడిన నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని అమ్మవారికి మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ మహారాజ్ చహకటి సూర్యరావ్, ఆయా గ్రామాల ఆదివాసీ భక్తులు పాల్గొన్నారు.



నైవేద్యాలు తయారు చేస్తున్న ఆదివాసీలు



ఇంద్రాదేవి ఆలయానికి తరలివచ్చిన ఆదివాసీలు

తీరిన నీటి కష్టాలు

సాక్షి ఎఫెక్ట్



భగీరథ నీటిని పరిశీలిస్తున్న అధికారులు

నేరడిగొండ: మండలంలోని దర్బ తాండలో గ్రామస్తులు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై ‘భగీరథ’ ఇక్కట్లు.. అనే శీర్షికన ‘సాక్షి’లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం మిషన్ భగీరథ ఇన్‌ట్రా డీఈ దేవయ్య, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ వెంకటేష్, గ్రిడ్ ఏఈ సునీల్ గ్రామానికి చేరుకొని భగీరథ నీటిని సరఫరా చేశారు. గ్రామంలో పర్యటించి నీటి సరఫరా తీరును పరిశీలించారు. ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తమ సమస్య తీరేలా కృషి చేసిన ‘సాక్షి’కి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.